## క్లుప్తంగా

### ఉత్తమ టీచర్‌కు సన్మానం



భారతిని సన్మానిస్తున్న టీచర్లు, తల్లిదండ్రులు

సీఎస్‌పురం (పామూరు): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జె.భారతి వృత్తిలో అంకితభావి అని ఉపాధ్యాయిని ఎస్‌వీఎస్‌వీ అలేఖ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ షేక్ అఫ్రోజ్ అన్నారు. జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న మండలంలోని ఆనికాలపల్లి హెచ్‌ఎం జె.భారతిని శనివారం పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్ అఫ్రోజ్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, తోటి ఉపాధ్యాయినులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆటపాటతో కూడిన విద్యను బోధిస్తూ పాఠశాల విద్యార్థుల శాతం పెరిగేందుకు, పాఠశాల అభివృద్ధికి ఎంతో దోహదపడిందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త షేక్ షహనాజ్, విజయలక్ష్మి, హేక్ హసీనా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### పండ్ల మొక్కలు నాటాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల మొక్కలు నాటాలని, ఇంకుడు గుంతల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్బారాయుడు సూచించారు. శనివారం ఉపాధి టీఏలు, ఎఫ్ఏలు, సీఓలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల సాగుకు 104 మంది రైతులు దరఖాస్తులు చేసుకోగా వారిలో 82 ఎకరాల్లో నిమ్మ సాగు చేసుకోనందుకు రైతులకు అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఏపీఓ వినయ్, ఈసీ గోపి, టీఏలు దివ్యవాణి, రాహంతుల్లా పాల్గొన్నారు.

### సర్పంచ్‌లకు శిక్షణ

హనుమంతునిపాడు: మండలంలోని 23 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీపీకి ఈ నెల 9,10వ తేదీన రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులు కనిగిరి ఎంపీడీఓ కార్యాలయంలో ఉంటాయన్నారు. తప్పకుండా సర్పంచ్‌లు శిక్షణ తరగతులకు హాజరు కావాలని కోరారు.

### సంక్రమిత వ్యాధులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం విజయలక్ష్మి

కనిగిరి రూరల్: ప్రతి ఒక్కరూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ సెంటర్ కౌన్సిలర్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు గ్రాండ్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వంటి సంక్రమిత వ్యాధులపై శనివారం అవగాహన కలిగించారు. విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. హెచ్‌ఎం కలువ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రాండ్ ఔట్ రిచ్ వర్కర్స్ అయిమల్ల నాగమణి, ఎస్.రమణమ్మ, లింగయ్య, సుస్మిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్‌గా దేవరపల్లి



దేవరపల్లి సుబ్బారెడ్డి

మర్రిపూడి: మండలంలోని గుండ్లసముద్రం గ్రామవాసి దేవరపల్లి సుబ్బారెడ్డికి కాంగ్రెస్ పార్టీలో అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్ర నేషనల్ కిసాన్ చైర్మన్ సుఖ్‌పాల్ సింగ్ ఆదేశాల మేరకు సుబ్బారెడ్డికి రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

### జీవామృతంతో భూమికి జీవం



జీవామృతం తయారు చేస్తున్న ప్రకృతి సిబ్బంది

టంగుటూరు: జీవామృతంతో భూమికి జీవమని ఐసీపీఆర్ సుజాత అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ నాచురల్ ఫామింగ్ ఆధ్వర్యంలో మండలంలోని కందులూరులో రైతు రామ్మూర్తి నిమ్మ తోటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ప్రతి 21 రోజులకు 200 లీటర్ల ద్రవ జీవ అమృతం తయారు చేసి నిమ్మ మొక్కలకు అందేవిధంగా చూసుకొంటే ఎటువంటి చీడలు మొక్క దరిదాపులకు రావని చెప్పారు. వీహెచ్ఏ అహ్మద్ బాష, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి విజయలక్ష్మి పాల్గొన్నారు.

# విషజ్వరాలతో విలవిల



వేములపాడులో ఆర్ఎంపీ వద్ద కిటకిటలాడుతున్న జ్వరపడితులు



వేమలపాడులో చికిత్స పొందుతున్న రోగులు

- ప్రతి గ్రామంలోనూ జ్వరపీడితులు
- పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖాధికారులు
- ఆర్ఎంపీల వద్ద కిటకిటలాడుతున్న రోగులు

హనుమంతునిపాడు:

పల్లెకు రోగమొచ్చింది. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో మంచాన పడ్డారు. కానీ అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడంతో అందుబాటులో ఉన్న ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. మండలంలో విషజ్వరాలు ప్రబలి ప్రజలు అల్లాడిపోతున్నారు. పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటం, వాతావరణ మార్పులతో జ్వరాలు ప్రబలాయి. ఇక అధ్వాన పారిశుధ్యంతో దోమలు దాడి చేయడం కూడా వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం.

**పట్టించుకునేదెవరు?**

14 సచివాలయ పరిధిలో హెల్త్ క్లీనిక్‌లున్నా వాటి ద్వారా సక్రమంగా సరైన వైద్య సేవలు అందడం లేదు. జ్వరం వస్తే ప్రభుత్వాసుపత్రికి రావాలంటే మండల కేంద్రానికి రావాల్సి వస్తోంది. పల్లెలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. హెల్త్ క్లీనిక్‌లలో వైద్య సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉంటారో ఎవరికీ అర్థం కాని పరిస్థితి. ఉదయం 10 గంటలకు వచ్చిన ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మధ్యాహ్నం ఒంటి గంట దాటితే మూతేసి వెళ్లిపోతున్నారు. ఏఎన్ఎంలు సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సిన వారు 1 గంటలోపే వెళ్లిపోతున్నారు. దీంతో రోగమొస్తే తప్పనిపరిస్థితుల్లో ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నామని వాపోతున్నారు.

**కిటకిటలాడుతున్న ఆర్ఎంపీ కేంద్రాలు**

మండలంలోని వేములపాడులో నాలుగు ఆర్ఎంపీ సెంటర్లు ఉన్నాయి. ప్రతి కేంద్రంలో జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఆ కేంద్రాల్లో వచ్చిన జ్వరపీడితులకు సరిపడినన్ని మంచాలు లేకపోవడంతో ఆరుబయట సెలైనే కట్టే పరిస్థితి నెలకొంది. ఆర్ఎంపీలు దీన్ని ఆసరాగా చేసుకొని ఇష్టంవచ్చినట్లు దోచుకోంటున్నారు. ఇంజక్షన్లు, సైలెన్లు మందుల పేరుతో వేలకు వేలు గుంజుతున్నారు. కొండారెడ్డిపల్లి, గొల్లపల్లి, ఉసుల్లపల్లి, లింగంగుంట్ల, నారాయిపల్లి, వాలిచర్ల, తిమ్మారెడ్డిపల్లి, ఆవుల వారిపల్లి, నల్లగండ్ల,, మహ్మదాపురం, రక్షనాపురం, కొనకనమిట్ల మండలంలోని చిన్నమనకొండ, గొట్టగట్టు, గాజులపల్లి, తర్లుపాడు మండలంలోని తాడివారిపల్లి వేములపాడుకు దగ్గరగా ఉన్న గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఇక్కడకు వస్తున్నారు.

**ఉన్నా ఉపయోగమేది..**

ప్రతి సచివాలయ పరిధిలో హెల్త్‌క్లీనిక్ ఉంది. ఆరోగ్య సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు ఉన్నారు. కానీ వారు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో ఎవరికీ తెలియడం లేదు. దీంతో రోగమొస్తే వాటి గురించి పట్టించుకోకుండా ఆర్ఎంపీ వద్దకు వెళుతున్నారు. మధ్యాహ్నం నుంచి ఇంటింటికి తిరిగి వైద్య సేవల అందించాల్సి ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు అడ్రాసు లేకుండా క్లీనిక్‌లు మూత వేసి వెళ్తున్నట్లు జ్వర పీడితులు చెప్తున్నారు. విష జ్వరాలతో చిన్న పిల్లలు.పెద్దలు విలవిలాడిపోతన్నారు.

> **నాలుగు రోజుల నుంచి జ్వరం**
>
> 
>
> నాలుగు రోజుల నుంచి జ్వరం వస్తుంది. తగ్గడం లేదు. జలుబు, తమ్ములు, ఒళ్లు నొప్పు, కాళ్ల నొప్పు లతో అల్లాడుతున్నాం. కొండారెడ్డిపల్లిలో హెల్త్ క్లీనిక్ ఉన్నా మాత్ర ఇచ్చే వారు లేరు. ఏఎన్ఎంలు, ఆశాలు ఎప్పుడు వస్తారో పోతారో కూడా తెలియదు. హనుమంతునిపాడులో ఆర్ఎంపీల వద్దకు వచ్చి రెండు రోజుల నుంచి వైద్యం చేయించుకుంటున్నాం.
>
> – కలుకూరి కొండయ్య, కొండారెడ్డిపల్లి

## అర్హులకు పథకాలు అందేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగసాని లక్ష్మి

పామూరు: అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీలు షేక్ అబ్దుల్, గట్లా శివకుమారి, పోలినేని శ్రీనివాసులు, ఆకుపాటి వెంకటేష్ మాట్లాడుతూ మండల కేంద్రం సీహెచ్‌సీలో, మండలంలోని బొట్లగూడూరు పీహెచ్‌సీలో డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందని, స్పెషలిస్టు డాక్టర్లు లేకపోవడంతో మెరుగైన వైద్యం అందడం లేదని, తక్షణం వైద్యసిబ్బంది కేటాయించేలా చూడాలని కోరారు. మండలంలోని రేగిచెట్లపల్లెలో పశువైద్యాధికారి లేరని, దీంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమావేశం దృష్టికి తేగా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి డాక్టర్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మండలంలోని దాదిరెడ్డిపల్లె, గుమ్మనంపాడు గ్రామాల్లో రికార్డుల్లో భూములకు, క్షేత్రస్థాయిలో భూములకు సంబంధం లేకుండా ఉందని, రికార్డుల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆ భూములు వాగులు, వంకలు, చెరువుల్లో ఉన్నాయని, సర్వేలో లోపాలను సరిచేయాలని పలువురు కోరగా సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ వాసుదేవరావు తెలిపారు. క్రీడాప్రాంగణం, బాలికల పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలం కేటాయించాలని కోరగా రికార్డులను, క్షేత్రస్థాయిలో స్థలం పరిశీలించి తగినంత స్థలం ఉంటే కేటాయిస్తామని చెప్పారు. నర్రమారెళ్లలో నివేశన స్థల హద్దులు చూపించాలని వైస్ ఎంపీపీ ఏసురత్నం కోరగా ప్రస్తుతం సర్వే చేస్తున్నామని, అందరికి రెండు రోజుల్లో హద్దులు చూపుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరావు, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, డిప్యూటీ ఎంపీడీఓ కె.సుందరరామయ్య, వైస్ ఎంపీపీ గంథం ఏసురత్నం, కో ఆప్షన్ షేక్ నాయబ్‌రసూల్, పీఏసీఎస్ చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, ఎంఈఓలు కోటిరెడ్డి, జి.కరుణకుమారి, డాక్టర్ షేక్ షరీఫ్, డాక్టర్ ఆర్.హనుమాన్, ఏఓ టి.అబ్రహంలింకన్, హౌసింగ్ ఏఈ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, పీఆర్ఏఈ మస్తాన్‌వలి, ఏపీఓ మాల్యాద్రి, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్, హెచ్ఓ కె.కుసుమ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, పార్వతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## లైటింగ్, డెకరేషన్ కొటేషన్లకు ఆహ్వానం

టంగుటూరు: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయలో నవంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు 11 రోజులు దసరా నవరాత్రులకు లైటింగ్, డెకరేషన్ కోటేషన్లు 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నట్లు ఆలయ ఈఓ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు కోటేషన్లు ఇవ్వాలని ఆలయ ఆయన కోరారు.

## పొగాకు అక్రమంగా కొనుగోలు చేయవద్దు



వేలాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: పొగాకు అక్రమంగా కొనుగోలు చేయరాదని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. ప్రస్తుత సంవత్సరం ధరలు చూసి అధిక ధరలకు బ్యారన్‌లు, పొలాలు లీజుకు తీసుకోవద్దని తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం ఎం.నిడమానూరు గ్రామానికి చెందిన రైతులు 945 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 835 కొనుగోలు జరిగాయి. 110 పొగాకు బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ.316 కాగా, కనిష్ట ధర రూ.125 పలికింది. సరాసరి రూ.242.18 ధర పలికింది. వేలంలో మొత్తం 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

## బడిఈడు పిల్లలు పాఠశాలల్లో చేరాలి




ఆధార్ లేని బడిబయట పిల్లలతో ఎంఈఓ, హెచ్‌ఎం

సీఎస్‌పురం (పామూరు): బడి ఈడు పిల్లలందరినీ తల్లిదండ్రులు విధిగా పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ జె.ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రం సీఎస్‌పురం ఎస్టీ కాలనీలో శనివారం ఎంఈఓ ప్రసాదరావు, పాఠశాల హెచ్‌ఎం ఆంథోని డోర్ టు డోర్ క్యాంపెయినింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా బడిఈడు ఉండి ఆధార్ కార్డులేని పిల్లలను గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరకుండా ఉండటం, కనీసం ఆధార్ కార్డు కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. తక్షణం వారికి ఆధార్ కార్డులు చేయించి పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు తోట శ్రీనివాసులు, దుద్దు పున్నమ్మ, పామల అరుణ, పిల్లల తల్లిదండ్రులు ఉన్నారు.

## రేపు వల్లూరమ్మ ఆలయం మూసివేత

టంగుటూరు: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయం ఆదివారం ఉదయం 09.56 గంటలకు భాద్రపద శుద్ధ పౌర్ణమి చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటలకు దర్శనం నిలిపివేయనున్నట్లు ఈఓ రమేష్ పేర్కొన్నారు. ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం అనుమతిస్తారని చెప్పారు.

## సింగరాయకొండ తహసీల్దార్‌గా రాజేష్



తహసీల్దార్ ఎస్‌వీబీ రాజేష్

సింగరాయకొండ: మండల నూతన తహసీల్దార్‌గా శనివారం ఎస్‌వీబీ రాజేష్ పదవీ బాధ్యతలు స్వీకరించారు.ప్రస్తుతపొన్నలూరు తహసీల్దార్ పుల్లారావు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రాజేష్ ప్రస్తుతం ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ఈయన గతంలో కలెక్టర్, జేసీలకు సీసీగా వ్యవహరించారు. డీటీ తానికొండ ప్రసాద్, ఆర్ఐ ప్రసాద్‌లు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## జమ్ములపాలెం వినాయకుడి నిమజ్జనం



పాకల తీరంలో నిమజ్జనం చేస్తున్న వినాయకుడు

సింగరాయకొండ: టంగుటూరు మండలం జమ్ములపాలెంలో నవరాత్రుల పూజలు అందుకున్న గణేషుడిని శనివారం మండలంలోని పాకల సముద్రతీరంలో నిమజ్జనం చేశారు. పాకల సముద్రతీరం భక్తులతో కిటకిటలాడింది. వైఎస్సార్ సీపీ టంగుటూరు మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు పాకల సముద్ర తీరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన తన స్వగ్రామం జమ్ములపాలెం వినాయక విగ్రహ నిమజ్జనంలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సింగరాయకొండ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## గిరిజనులకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

కందుకూరు: మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన పిల్లలకు వందశాతం ఆధార్ నమోదు చేయించడం కోసం ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె. అనూష శనివారం తెలిపారు. దీనిలో భాగంగా 6 సంవత్సరాల్లోపు గిరిజన పిల్లలందరికీ ఆధార్ నమోదు చేస్తామన్నారు. ఈనెల 8వ తేదీ జనార్దనకాలనీ సచివాలయం, నల్లమళ్లవారితోట సచివాలయాల్లో ఆధార్ నమోదు క్యాంపు జరుగుతుందని తెలిపారు. అలాగే ఈనెల 9వ తేదీ ఉప్పుచెరువు, జనార్దన కాలనీ సచివాలయాలు, 10వ తేదీ కోటువారి స్ట్రీట్, శ్రీనగర్ కాలనీ సచివాలయాలు, 11వ తేదీ యర్రవడ్డిపాలెం, కోటువారి స్ట్రీట్ సచివాలయాల్లో, 12వ తేదీ గుర్రంవారిపాలెం సచివాలయంలో ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులు జరుగుతాయని తెలిపారు. కావున గిరిజన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## చెన్నకేశవస్వామి ఆలయంలో టీడీపీ సభలు



సన్మానం అందుకుంటున్న టీడీపీ నాయకులు

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి చెన్నకేశవస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి కూటమి ప్రభుత్వానికి చెందిన టీడీపీ నాయకులు రాజకీయ సమావేశం నిర్వహించడంపై వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొప్పర వెంకన్న తీవ్రంగా ఖండించారు. ఆలయాల్లో ఎటువంటి రాజకీయ సమావేశాలు నిర్వహించడం కుదరదని తెలిసినా టీడీపీ నాయకులు పలు పదవులు పొందిన ముగ్గురికి సన్మానం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆలయంలో రాజకీయ సమావేశాలు జరుగుతుంటే దేవదాయ శాఖ అధికారులు అడ్డుకోవాల్సింది పోయి ఎందుకు సహకరించారని ప్రశ్నించారు.



టంగుటూరులో అనధికార వెంచర్

## టంగుటూరులో అనధికార వెంచర్లు

- వ్యవసాయ భూమిలో దర్జాగా రియల్ దందా

టంగుటూరు: రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏకంగా ఒడా, పంచాయతీ అనుమతులు లేకుండా వ్యవసాయ భూమిలో వెంచర్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు. 636 సర్వే నంబర్‌లో అటు టీడీపీ నాయకులకు, ఇటు పంచాయతీ అధికారులకు భారీగా ముడుపులు అందించి రైతుల వద్ద నుంచి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి రూ.కోట్లల్లో సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. టంగుటూరు పంచాయతీ పరిధి ఫైర్‌స్టేషన్ సమీపంలో సర్వే నంబర్ 636లో 70 సెంట్ల వ్యవసాయ భూమిలో ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు రూ.లక్షల్లో కొనుగోలు చేసి 22 ప్లాట్లుగా మార్చి ఒక్కో ప్లాటు రూ.20 లక్షలకు అమ్మకాలు జరుపుతున్నారని, అందులో 30 అడుగుల రోడ్డు ఉండాల్సి ఉండగా కేవలం 12 అడుగుల రోడ్డు ఏర్పాటు చేసి సరిపెట్టుకున్నారు. స్థానిక చెల్లెమ్మతోటలో ఒక అపార్టుమెంటు, రైల్వే స్టేషను సమీపంలో అనుమతులు లేకుండా ఐదు ఫ్లోర్లల్లో నిర్మిస్తున్నా అధికారులు మామూళ్ల మత్తులో తూగుతున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు అనధికార వెంచర్లు, అపార్టుమెంట్ల నిర్మాణాలు అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. దీనిపై తహసీల్దార్ ఆంజనేయులను వివరణ కోరగా టంగుటూరు రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో అనధికార వెంచర్లపై చర్యలు తీసుకుంటామని, 636లో అనుమతులు లేకుండా వెంచర్లు, ఆ పరిధిలోని వీఆర్వోతో పరిశీలించి నోటీసులు జారీ చేసి పనులు నిలుపుదల చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు.

## నో బ్యాగ్ డే విధిగా అమలు చేయాలి



బొమ్మలు వేయిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి నెలా మొదటి, మూడో శనివారాల్లో ×సృజన–శనివారం సందడి× పేరుతో నో బ్యాగ్ డే విధిగా అమలు చేయాలని మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రం సీఎస్‌పురం వడ్డెపాలెం ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని కలిగించి వారిలో దాగి ఉన్న వివిధ రకాల సృజనాత్మక నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇది ఎంతో దోహద పడుతుందన్నారు. బొమ్మలు గీయడం, రంగులు వేయడం, నాటికలు, ఏకపాత్రాభినయం, నృత్యం, వంటివి విద్యార్థులకు నేర్పించాలన్నారు. పాఠశాలల్లోని గ్రంథాలయ పుస్తకాలను పూర్తిస్థాయిలో వినియోగించాలని, పిల్లలతో చదివించాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, కుటుంబ సంక్షేమ సిబ్బంది పంచాయతీ సిబ్బంది, పోస్టాఫీసు సిబ్బంది వంటి వారి పాఠశాలలకు ఆహ్వానించి వారి విధులు, బాధ్యతల గురించి, సేవల గురించి పిల్లలకు తెలియజెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట క్లస్టర్ హెచ్‌ఎం షేక్ ఖాదరున్నీసాబేగం, సీఆర్ఎంటీ వి.సతీష్‌కుమార్ ఉన్నారు.

## రిజిస్ట్రేషన్ ఉన్న నర్సరీల నుంచే నారు కొనాలి



అవగాహన కల్పిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: రైతులు రిజిస్ట్రేషన్ ఉన్న నర్సరీల నుంచే నారు కొనుగోలు చేయాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు బోర్డులో వాణిజ్య సరళిలో ఎఫ్‌సీవీ పొగాకు నారు మళ్ల పెంపకం, రిజిస్ట్రేషన్, నియంత్రణ గురించి రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ మాట్లాడుతూ పొగాకు బోర్డు చట్టం 1975 లోని సెక్షన్ 10 ఏ (1) ప్రకారం, వాణిజ్య సరళిలో ఎఫ్‌సీవీ పొగాకు నారుమడి సాగు చేసే రైతులు తప్పనిసరిగా వారి పరిధిలోని పొగాకు బోర్డు కార్యాలయం నుంచి రిజిస్ట్రేషన్ పొందాలని చెప్పారు. గరిష్టంగా ప్రతి రైతు రెండు హెక్టార్ల విస్తీర్ణం వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. పొగాకు బోర్డు చట్టం ప్రకారం నారును రిజిస్టర్ రైతులకు కాకుండా వేరే ఏ వ్యక్తికి విక్రయించకూడదన్నారు. నారుమడుల రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి పొగాకు బోర్డు నారు అమ్మకాలకు సంబంధించి రసీదు పుస్తకాలు సరఫరా చేస్తారని పేర్కొన్నారు. నారుమడి సొంతంగా పెంచుకున్న రిజిస్టర్ రైతులు నవంబర్ 30వ తేదీలోపు నారుమడులు తీసివేయాలని చెప్పారు. పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, క్షేత్రాధికారి జి.ఉపేంద్ర పాల్గొన్నారు.

## అవకతవకలకు పాల్పడితే చర్యలు



స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న సీఐ రాఘవరావు

కొండపి: ఎరువుల దుకాణదారులు ఎరువుల విషయంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాఘవరావు హెచ్చరించారు. శనివారం కొండపిలోని రెండు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు కొండపిలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్‌లు, ధరల పట్టికను పరిశీలించారు. తనిఖీల్లో ఏవో శివనాగప్రసాద్, పొన్నలూరు ఏవో రాము, ఏఈఓ కుమార్ పాల్గొన్నారు.

## దేవస్థానం భూముల వేలం వాయిదా

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం దావగూడూరు పంచాయతీ చెన్నకేశవ స్వామి దేవస్థానం భూముల వేలం పాటలు శనివారం నిర్వహించగా పాటదారులు ముందుకు రాకపోవటంతో వాయిదా పడినట్లు కార్యనిర్వహణాధికారి సాంబశివరావు తెలిపారు. ఆలయానికి సంబంధించి 294 ఎకరాలు ఉండగా గత సంవత్సరం 12 వేల నుంచి 25 వేల వరకు వేలం జరిగింది. ఈ సంవత్సరం పొగాకు సాగులో నష్టాలు రావటంతో రైతులు 12 వేలకుపైగా పాడటానికి ముందుకు రాలేదు. దీంతో పాటలు రద్దు చేశామని, త్వరలో మళ్లీ వేలం పాటలు నిర్వహించేది ఎప్పుడో ప్రకటిస్తామని ఈఓ సాంబశివరావు తెలిపారు.